క్లుప్తంగా

పట్టుబడిన వాహనాల వేలం



వేలం నిర్వహిస్తున్న సెబ్ అధికారులు

కోవెలకుంట్ల: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కార్యాలయ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు శనివారం వేలంపాట నిర్వహించారు. నాటుసారా, అక్రమ మద్యం తరలిస్తూ పట్టుబడిన తొమ్మిది ద్విచక్ర వాహనాలకు సెబ్ డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో వేలం పాట ఏర్పాటు చేశారు. వీటి ధర రూ. 1.11 లక్షలుగా నిర్ణయించగా వేలందారులు రూ. 1.35 లక్షలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో సెబ్ సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్‌ల సమస్యల పరిష్కారానికి కృషి



వేణుగోపాలు రెడ్డిని సత్కరిస్తున్న గ్రామస్తులు

బేతంచెర్ల: డోన్ నియోజకవర్గం సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన సీతారామాపురం సర్పంచ్ చిట్టి వేణుగోపాలు రెడ్డిని శనివారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఆయనకు గ్రామస్తులతోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు నాగరాజు, నాగేంద్ర, బాలమద్దయ్య, రాంపుల్లయ్య, పిల్లి లక్ష్మయ్య తదితరులు శాలువాలు కప్పి పూలమాలలు వేసి సత్కరించారు. సర్పంచ్‌ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చిట్టి వేణుగోపాలు రెడ్డి తెలిపారు.

పిచ్చిమొక్కల తొలగింపు



పిచ్చి మొక్కలను తొలగిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మండల పరిధిలోని గోరుమానుకొండతండాలో ఈనెల 7న జరిగే గ్రామ దేవర ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు కార్మికులతో వీధులను శుభ్రం చేయించారు. అదేవిధంగా ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చిమొక్కలను జేసీబీతో తొలగింపు పనులు చేయించారు. ప్రతిఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని ఈసందర్భంగా గ్రామస్తులకు సర్పంచ్ సూచించారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

డోన్ టౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్, స్నేక్ రిస్క్యూ సభ్యుడు ఇదురుష్ తెలిపారు. స్థానిక నగర వనంలో శనివారం పట్టణంలోని శ్యాంజో స్కూల్ విద్యార్థులు నేచర్ క్యాంప్‌లో భాగంగా వన్యప్రాణుల ప్రాముఖ్యత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫారెస్టు బీట్ ఆఫీసర్లు శివమ్మ,మహేశ్వరి,భారతి,వీరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

బనగానపల్లె: గుట్కా తదితర పొగాకు ఉత్పత్తులకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర మహమ్మద్‌గౌస్ సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం నిర్వహించారు. డాక్టర్ మహమ్మద్‌గౌస్ మాట్లాడుతూ క్యాన్సర్ ప్రమాదకరమన్నారు. పొగత్రాగడం, మద్యం సేవించడం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. క్యాన్సర్ వ్యాధి రకాలు, లక్షణాలను విద్యార్థులకు వివరించారు.

5లోపు దరఖాస్తు చేసుకోవాలి

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సహకారంతో 3నెలల పాటు ఇచ్చే ఉచిత జనరల్ డ్యూటీ అసిస్టెంట్ నర్సింగ్ సహాయకుల శిక్షణకు యువతులు దరఖాస్తు చేసుకోవాలని సెంటర్ కోఆర్డినేటర్ బంగీ శిరీష శనివారం తెలిపారు. 18 నుంచి 35 ఏళ్లలోపు యువతులకు ఈనెల 6వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభం అవుతుందన్నారు. 5వ తూదీలోపు దరఖాస్తు చేసుకోవాలని,శిక్షణ పూర్తయ్యాక ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన

డోన్ టౌన్: ప్రపంచ క్యాన్సర్ వ్యాధి నివారణ దినోత్సవం పురష్కరించుకుని శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ భారతి, జంతుశాస్త్రం విభాగాధిపతి లక్ష్మయ్య ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. క్యాన్సర్ లక్షణాలు, రకాలు, నివారణ మార్గాలను విద్యార్థులకు వివరించారు. అధ్యాపకులు లోక్‌రాజు, స్వరూపరాణి, లలితకుమారి పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు
- సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు కీలకం
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: పేదల అభ్యున్నతే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. ప్రజల వద్దకే పాలన అందించడమే ధ్యేయంగా సీఎం తీసుకొచ్చిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థల పాత్ర పేదలకు ప్రభుత్వ పథకాలు అందజేయడంలో కీలకమన్నారు. మండలంలోని నందివర్గం గ్రామంలో రెండవరోజు శనివారం ఎమ్మెల్యే కాటసాని గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంపీటీసీ నారాయణ, కుర్ణి కార్పొరేషన్ డైరెక్టర్ శ్యామలాదేవి ఆధ్వర్యంలో నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే కాటసాని గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఎమ్మెల్యేకు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలుకరించిన ఆయన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని వివరించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. బుక్‌లెట్‌లోని వివరాల మేరకు ప్రభుత్వ పథకాలు వర్తించాయా లేదా అని ఆయా కుటుంబ సభ్యులను కాటసాని అడిగి తెలుసుకున్నారు. అన్ని పథకాలు వర్తించాయని లబ్ధిదారులు ఎమ్మెల్యేకు సంతోషంగా తెలిపారు. కొన్ని కుటుంబాలవారికి మూడు నుంచి నాలుగు లక్షల రూపాయల వరకు లబ్ధి చేకూరడంతో వారు ఎమ్మెల్యే ఎదుట ఆనందం వ్యక్తం చేశారు. మూడేళ్లలో నందివర్గం గ్రామానికి మంజూరు చేసిన నిధులు, చేసిన అభివృద్ధిని వివరించారు. అర్హులందరికీ న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హత ఉండి కూడా సంక్షేమ పథకాలు వర్తించని వ్యక్తులు ఉంటే తమ దృష్టికి తేవాలని, న్యాయం చేస్తామని ఈసందర్భంగా కాటసాని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకే ప్రభుత్వం సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చిందని, ఏ సమస్య ఉన్నా వారిని సంప్రదించాలని సూచించారు. ఈ గ్రామం చేనేత పరిశ్రమకు పుట్టినిళ్లలాంటిదని, ఉన్నతాధికారులతో చర్చించి ఈ పరిశ్రమ మరింత అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

మెరుగైన సేవలు అందించేందుకే గృహ సారథులు నియామకం

ప్రజలు ఇంకా మెరుగైన సేవలు అందజేసేందుకు ప్రతి సచివాలయానికి ముగ్గురు కన్వీనర్లు, ప్రతి 50 ఇళ్లకు ఇద్దరు గృహసారథులను నియమించాలన్న సీఎం వైఎస్ జగన్ నిర్ణయం అభినందనీయమని



గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా నందివర్గంలో ఓ మహిళా కుటుంబానికి ప్రభుత్వం నుంచి వర్తించిన పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులు సమన్వయంతో ముందుకు సాగాలని, ప్రజలకు అన్నివిధాలుగా సహాయ, సహకారాలు అందజేస్తూ అండగా నిలువాలని పిలుపునిచ్చారు. ఉనికిని కాపాడుకునేందుకు లోకేష్ చేస్తున్న పాదయాత్ర నిరుపయోగమని, టీడీపీకీ ఎటువంటి ప్రయోజనం ఉండదని ఎద్దేవా చేశారు. ఉత్తుత్తి ప్రచారం తప్పా ఆయన పాదయాత్రకు ప్రజల నుంచి ఏ మాత్రం స్పందనలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివరామయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ, పీఆర్ ఏఈ రమణ, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు సంట్టెన్న, నడిపి సుబ్బారెడ్డి, కర్ణ, విజయ్‌కుమార్, రామిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులు, సురేష్, నాగేంద్రుడు, అవుల పుల్లయ్య, బిలక్ష్మీరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, బాబు, ఖాజాహుస్సేన్, ఎస్‌ఏ సలాం, వెంకటస్వామి, పీవీ సుబ్బరామయ్య వీ లక్ష్మీ సుబ్బయ్య, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నదే లక్ష్యం

- ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్: కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఎస్ గుండాల గ్రామంలో సర్పంచ్ తేజోమణి భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ నీలమ్మ ఆధ్వర్యంలో ఆయన గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులుతో కలిసి గడపగడపకు మంత్రి వెళ్లి ప్రభుత్వ పరంగా వారు లబ్ధిపొందిన వివరాలు తెలియజేశారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన వివరాల బ్రోచర్లను యజమానులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసమే కుల,మత, వర్గ, రాజకీయ ప్రమేయం లేకుండా అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత దేశంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఆర్థిక అసమానతలను రూపుమాపాలనే లక్ష్యంతో బడుగు, బలహీనవర్గాల ఆర్థికాభివృద్ధికి ముస్లిం, మైనార్టీ వర్గాల వారికి అన్ని నామినేటెడ్ పోస్టుల్లో సీఎం ప్రాధాన్యత కల్పించారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని తెలిపారు. జాతిపిత కలలుకన్న గ్రామ స్వరాజ్యం ఏర్పాటులో భాగంగానే సచివాలయ వ్యవస్థతో పాటు ఆర్‌బీకేలు, విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల పనితీరు దేశానికే ఆదర్శంగా నిలిచాయని వివరించారు. అర్హులై ఉండి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందని వారు ఎవరైనా ఉంటే సమీపంలోని సచివాలయాల అధికారులను సంప్రదించి తిరిగి దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

బనగానపల్లెరూరల్: ప్రజా సమస్యలను రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సూచించారు. గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటించిన తనకు ఎక్కువగా రెవెన్యూ సమస్యల నుంచి ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారని, అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మండల కేంద్రంలో బనగానపల్లెలో రూ.90లక్షలతో నిర్మించిన నూతన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ప్రసంగించారు. గత ప్రభుత్వం హాయంలో మంజూరైనా అప్పటి పాలకులు పట్టించుకోనందున భవనం నత్తనడక సాగిందని, మన ప్రభుత్వ హాయంలో పూర్తి చేసి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యాలయానికి త్వరలో ప్రహరీ మంజూరు చేస్తామని, ఫారెస్ట్ అధికారులతో చర్చించి చుట్టూ అందమైన మొక్కలను పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్‌అండ్‌బీ ఎస్‌ఐ నాగరాజు మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ నిర్మూలించేందుకు



రూ.90లక్షలతో నిర్మించిన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బైపాస్ రోడ్డు మంజూరైందని, టెండర్లు పూర్తికాగనే పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఎంపీడీఓ శివరామయ్య మాట్లాడుతూ బనగానపల్లె మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ సురేష్ బాబు, డీఈఈ సునీల్‌రెడ్డి, ఏఈ హుస్సేన్, కొలిమిగుండ్ల తహసీల్దార్ అల్‌ఫ్రెడ్, అమరావతి హైవే డిప్యూటీ కలెక్టర్ రామకృష్ణ, ఆర్‌ఐ రాఘవేంద్ర ప్రసాద్, అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి గుండంశేషిరెడ్డి, ఎంపీపీ మానసవీణ, జెడ్పీటీసీ లక్ష్మీసుబ్బమ్మ, పట్టణ సర్పంచ్ ఈసారి యల్లమ్మ, ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ అబ్దుల్‌ఖైర్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముక్కమళ్లపుల్లారెడ్డి, ఈశ్వర్ నాయక్, బాలు, బండి బ్రహ్మానందరెడ్డి, డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, మాజీ ఎంపీటీసీ యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవాలి

బేతంచెర్ల: పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవాలని రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ మద్దిలేటి స్వామి, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జశ్వంత్ రెడ్డి, సునీల్ కుమార్ అన్నారు. పట్టణానికి చెందిన సుభాకర్ రాజు అనే యువకుడు 1.40 గంటల పాటు నీటిలో పద్మాసనంలో కూర్చొని వరల్డ్ రికార్డు సాధించి నెల 24వ తేదీన మెడల్, సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం సుభాకర్ రాజుతో పాటు అతని తల్లి దండ్రులను ఘనంగా సత్కరించారు. మండలానికి చెందిన యువకుడు వరల్డ్ రికార్డు సాధించడం అందరికీ గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు గుండా గోపాలు, విజయనాగరాజు, సత్తార్, మోహన్‌రెడ్డి, మాణిక్యం పాల్గొన్నారు.



సుభాకర్ రాజుతో పాటు తల్లిదండ్రులను సన్మానిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

ఎల్‌ఐసీ పాలసీదారుల సొమ్ముకు ధోకా లేదు

డోన్ టౌన్: ఎల్‌ఐసీ పాలసీదారుల సొమ్ము భద్రతకు ఏలాంటి ధోకా లేదని ఆ సంస్థ ఉద్యోగుల సంఘాల జాయింట్ ఫ్రంట్ కమిటీ సభ్యుడు, ఫీల్డ్ వర్కర్స్ యూనియన్ కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ హామీ ఇచ్చారు. ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న అమెరికన్ షార్ట్ సెల్లర్ హిండన్‌బర్గ్ అదానీ గ్రూప్ సంస్థలపై చేసిన విమర్శలపై శనివారం ఆయన పాత్రికేయులకు తెలిపారు. అదానీ గ్రూపులో ఎల్‌ఐసీ భారీగా పెట్టుబడులు ఉన్నాయని, మధ్యతరగతి ప్రజల పొదుపు మొత్తాలకు ముప్పు ఉందని కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, ఏలాంటి ముప్పు లేదన్నారు. వ్యాపారాల్లో లాభ నష్టాలు సర్వ సాధారణం అని, గతంలో లాభాలు వచ్చినప్పుడు ఏలాంటి ప్రచారం లేదన్నారు. పాలసీదారుల పొదుపులో 80శాతం పెట్టుబడులను ప్రభుత్వ సెక్యూర్టీలో ఉంటాయని, మిగిలిన 20శాతం మాత్రమే భద్రత ఉన్న ఇతర రకాల పెట్టుబడులో పెడుతామన్నారు. అక్రమాలేవో జరిగాయన్న ఆరోపణలతో కాంగ్రెస్ పార్టీ 6వ తేదీన దేశ వ్యాప్తంగా ఎల్‌ఐసీ కార్యాలయాల వద్ద నిరసన చేపట్టాలనుకోవడం సంస్థ ప్రతిష్టను దెబ్బతీయడమే అన్నారు. ఈ విషయంపై కాంగ్రెస్ పార్టీ పునరాలోచించాలని ఆయన కోరారు.

ఉపాధి పనులు తనిఖీ

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లె సమీపంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను శనివారం ఎంపీడీఓ సుబ్బరాజు తనిఖీ చేశారు. మస్టర్ పరిశీలించి కూలీల హాజరు చెక్ చేశారు. ఖండిత కందకాల పనుల తీరును పరిశీలించి కూలీల వివరాలను ఏపీఓ గంగన్నను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేపట్టాలని కూలీలకు సూచించారు.

ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలి

ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ఎంపీడీఓ సుబ్బరాజు లబ్ధిదారులకు సూచించారు. హౌసింగ్ డేలో భాగంగా తుమ్మలపెంట సమీపంలోని జగనన్న కాలనీని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం, హౌసింగ్ ఏఈ మద్దిలేటితో కలిసి ఎంపీడీఓ పరిశీలించారు. తుమ్మలపెంట లేఅవుట్‌లో 80 ఇళ్లు మంజూరు అయ్యాయని, 57 గృహ నిర్మాణాలు వివిధ రకాల స్టేజీలో ఉన్నాయని తెలిపారు. ఇంకా 23 మంది నిర్మాణాలు చేపట్టలేదని, పనులు ప్రారంభించకుంటే పట్టాలు రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శివశంకర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, వీఆర్వో రామలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీల మస్టర్ పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుబ్బరాజు

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



కోవెలకుంట్లలో గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

కోవెలకుంట్ల: నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా లబ్ధిదారులు పక్కాగృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని తహసీల్దార్ పుష్పకుమారి, ఎంపీడీఓ మహబూబ్‌దౌలా సూచించారు. శనివారం స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగాది పండుగ నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి సొంతింటి కల నెరవేర్చుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఒక్కో గృహానికి ప్రభుత్వం మూడు విడతల్లో రూ. 1.80 లక్షల బిల్లులు చెల్లిస్తోందన్నారు. అదేవిధంగా ఉచితంగా 20 టన్నుల ఇసుక, రాయితీపై సిమెంట్, ఇనుప కడ్డీలు, గృహ నిర్మాణ సామగ్రి అందజేస్తోందన్నారు.పొదుపు మహిళలకు రూ. లక్ష వరకు రుణాలు మంజూరు చేస్తోందన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ కృష్ణారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఈఓపీఆర్డీ రాధిక, హౌసింగ్ సిబ్బంది, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో పర్యటించిన కేంద్రబృందం

కోవెలకుంట్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం కేంద్ర బృందం పర్యటించింది. అమడాల, గుంజలపాడు గ్రామాల్లో కేంద్ర బృంద సభ్యులు సంతోష్‌కుమార్, సతీష్‌కుమార్ ప్రధాన్ వివిధ పథకాలకు సంబంధించిన వివరాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ క్రాంతిపథం ద్వారా అందుతున్న రుణాలు, మహాత్మగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం అమలు, పంచాయతీరాజ్, ఉద్యానవన, మల్బరీ పంటల సాగు, హౌసింగ్ తదితర పథకాల అమలును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, తహసీల్దార్ పుష్పకుమారి, ఉపాధి పథకం ఏపీడీ సాంబశివరావు, ఏపీఓ శ్రీవిద్య, ఈఓపీఆర్డీ రాధిక, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వివిధ పథకాల అమలుపై లబ్ధిదారులతో మాట్లాడుతున్న కేంద్రబృందం

ఉద్యోగుల సమస్యలపై చర్చ

బనగానపల్లెరూరల్: స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో శనివారం ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల బనగానపల్లె తాలూకా అధ్యక్షుడు, కంటి వైద్యుడు ఎంసీ హెచ్ బిచ్చయ్య అధ్యక్షతన చర్చా వేదిక జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన ఏపీ ప్రభుత్వ ఎంప్లాయిస్ అసోయేషన్(ఏపీజీఈఏ) జిల్లా కార్యదర్శి నాగేంద్రప్ప, జిల్లా సహ అధ్యక్షుడు గిరిశివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వ సానుకులంగా ఉందన్నారు. చర్చలో తీసుకున్న నిర్ణయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారించాలని కోరుతామన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా సహ అధ్యక్షురాలుగా ప్రభుత్వవైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుజాతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఏపీజీఈఏ నూతన డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు సునీల్‌కుమార్, సత్యం, తాలూకా కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు అబ్దుల్, రహీమ్, రవితేజ, ఆత్మకూరు తాలూకా అధ్యక్షుడు బాలకృష్ణయ్య తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు సీతారాముల కల్యాణం

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని కొండపై వెలసిన శ్రీతిరుమల వీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఆదివారం ఉదయం శ్రీసీతారామచంద్రస్వాములవారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు రామాంజనేయులు, మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్రికె హరికిషన్, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు భానుసింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 108 జంటలతో సీతారాముల ఉత్సవ విగ్రహాలకు కల్యాణం జరిపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన దలచిన దంపతులు తమ పేర్లు ముందుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కల్యాణం రోజు కొండమీదకు వెళ్లడానికి పట్టణంలోని శేగు థియేటర్ వద్ద ఉదయం నుంచి ఉచితంగా వాహన సౌకర్యం ఏర్పాటు చేశామని, భక్తులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

నేటి నుంచి గంగజాతర

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని గొర్విమానుపల్లెలో గ్రామ పెద్దలు, ప్రజల ఆధ్వర్యంలో ఆదివారం నుంచి రెండు రోజుల పాటు గంగజాతర(ఆవుల పబ్బం) నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం రాత్రి కాటమరాజు కథ, సోమవారం హరిభజన ఏర్పాటు చేశామన్నారు. సాయంత్రం గ్రామ శివార్లలో ఉన్న గంగమ్మ అమ్మవారి ఆలయం వద్ద గ్రామస్తులు పెద్దఎత్తున పొంగుపాలు కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతి ఏటా సాంప్రదాయ బద్ధంగా గంగజాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని గ్రామ పెద్దలు చెప్పారు.

మారెమ్మ విగ్రహ ప్రతిష్ఠ పూజలు

బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామంలో టీటీడీ, సమరసత సేవా ఫౌండేషన్ సంయుక్తంగా రూ.10 లక్షలతో నిర్మించిన నూతన మారెమ్మ ఆలయలో శనివారం అమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం యంత్ర ప్రతిష్ఠ అనంతరం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. ఆర్ బుక్కాపురం గ్రామానికి చెందిన దేవి ఉపాసకులు శంకరా నంద గిరి స్వామి, సమరసత సేవా ఫౌండేషన్ నంద్యాల జిల్లా దేవాలయాల కమిటీ కన్వీనర్ నాగ మోహన్‌రెడ్డి పూజల్లో పాల్గొన్నారు.

మండప నిర్మాణానికి భూమి పూజ

బేతంచెర్ల: బనగానపల్లె రహదారిలో వెలసిన చాముండేశ్వరీ, జటాధర స్వామి ఆలయ ఆవరణలోని ఆంజనేయస్వామి ఎదుట మండప నిర్మాణానికి శనివారం భూమి పూజ నిర్వహించారు. అర్చకుడు ప్రభాకర్ శర్మ ఆధ్వర్యంలో శా స్త్రోకంగా మంత్రాలు చదువుతూ భూమి పూజ చేశారు. దాతల సహకారంతో మండపం నిర్మా ణం చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నాణ్యమైన విద్యనందించాలి

- మంగంపేట పాఠశాలను తనిఖీ చేసిన డిప్యూటీ డీఈఓ కిష్టఫర్

అవుకు: విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన చేయాలని, నాణ్యమైన విద్యనందించాలని డోన్ డిప్యూటీ డీఈఓ జీజే కిష్టఫర్ ఉపాధ్యాయులకు సూచించారు. మండల పరిధిలో కొండప్రాంతంలో ఉన్న మంగంపేట ఉన్నత పాఠశాలను శనివారం ఉర్దూ డీఐ ఆదాం భాషతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడిన ఆయన వసతులపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం వడ్డిస్తున్నారా లేదా.. నాణ్యతగా ఉందా.. తాగునీటి సమస్య ఏమైనా ఉందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా విద్యార్థులకు ప్రశ్నలు సంధించి సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మనబడి నాడు–నేడు పథకంలో రూపురేఖలను మార్చేసిందని, అందుకు తగ్గట్టుగానే బోధన ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎక్కడో కొండ ప్రాంతాల్లో పాఠశాలలు ఉన్నాయిలే... తనిఖీ చేయటానికి ఇక్కడికి అధికారులు ఎవ్వరూ రాలేరులే అనే అపోహ పడొద్దని హెచ్చరించారు. సమయపాలన పాటించకున్నా.. బోధనలో నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవన్నారు. అనంతరం మంగంపేట పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులు, అదనపు తరగతి గదుల నిర్మాణాలను పనులను డిప్యూటీ డీఈఓ పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు గోవిందునాయక్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ జీజే కిష్టఫర్

నాడు నేడు పనులు వేగవంతం చేయాలి

బనగానపల్లెరూరల్ : మనబడినాడు నేడు పథకం కింద ఎంపికైన ఎంపీపీ, ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని నంద్యాల జిల్లా సమగ్రశిక్ష అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ లలితకుమారి, అసిస్టెంట్ మానిటరింగ్ ఆఫీసర్ యూసుఫ్‌ఖాన్ ఆదేశించారు. పట్టణంలోని పంచమపేట కాలనీలోని ఎంపీపీ,జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, తెలుగుపేట ఎంపీపీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం వారు పరిశీలించారు. అదేవిధంగా రవ్వలకొండపై నిర్మిస్తున్న మహాత్మాజ్యోతిరావుపూలే గురుకుల పాఠశాల భవన నిర్మాణాలను వారు పరిశీలించి ఇంజినీరింగ్ అసిస్టెంట్స్, కాంట్రాక్టర్‌తో మాట్లాడి సమస్యలపై ఆరా తీసి త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న సబ్జెక్ట్ ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ స్వరూప, సీఆర్‌పీలు సుధాకర్‌రావు, సుబ్బలక్ష్మీ, శివరామమద్దిలేటి, శివప్రసాద్ డిటీపీ పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎంపీపీ పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న లలిత కుమారి

మద్దిలేటయ్య ఆదాయం రూ.4,58,087

బేతంచెర్ల : మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం శివార్లో వెలసిన శ్రీ మద్దిలేటి నరసింహస్వామిని దర్శించుకునేందుకు మాఘమాస శనివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. సేవా టికెట్స్, లడ్డు ప్రసాదం, గదుల బుకింగ్, అన్నదానం చందాలు, గండదీపం, విరాళాలు, కల్యాణ కట్ట తదితర సేవల ద్వారా రూ. రూ.4,58,087 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, ఆలయ చైర్మన్ సీతారామచంద్రుడు తెలిపారు. స్వామి వారి ఆలయ పునర్నిర్మాణానికి డోన్ పట్టణానికి చెందిన ముష్టిపల్లె రామకృష్ణారెడ్డి రూ. 50 వేలు, హైదరాబాద్ బోడుప్పల్, యాదాద్రి కాలనీకి చెందిన నారాయణ స్వామి రూ.20,116, కల్లూరు మండలం, ఉలిందకొండ గ్రామానికి చెందిన బోయ మనీష రూ. 20 వేలు చొప్పున విరాళం అందజేశారు. ఆలయ పాలక మండలి సభ్యులు లక్ష్మణ్ నాయుడు, తిమ్మారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులపై ఎస్పీకి ఫిర్యాదు

డోన్ టౌన్ : తన పొలంలో అక్రమంగా ప్లాట్లు వేస్తున్నారని రియల్‌ఎస్టేట్ వ్యాపారులను ప్రశ్నించినందుకు తనపై 14 మంది కలిసి దాడి చేసారని, రక్షణ కల్పించి న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ రఘువీరారెడ్డికి శనివారం ఫిర్యాదు చేసినట్లు మండల పరిధిలోని ఉడుములపాడు గ్రామస్తుడు గుర్రపు నాగేంద్రుడు తెలిపారు. జగదుర్తి గ్రామ సమీపంలో తనకు సంబంధించిన భూమిలో అధికారులతో కుమ్మక్కై అక్రమంగా ప్లాట్లు వేస్తున్నారని, ఈ విషయంపై ప్రశ్నించగా దాడి చేసారని ఆవేదన వ్యక్తం చేశాడు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

బనగానపల్లెరూరల్: జాబ్ కార్డు కలిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించి కూలీల సంఖ్య పెంచాలని నంద్యాల జిల్లా డ్వామా పీడీ రామచంద్రారెడ్డి సూచించారు. మండలంలోని చెరువుపల్లె గ్రామంలో అక్కజమ్మ చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఉపాధి కూలీలకు వందరోజుల పని కల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్ పై ఉందన్నారు. అలాగే ప్రజలకు, రైతులకు ఉపయోగపడే పనులను ఈ పథకం ద్వారా చేయించాలన్నారు. ప్రతి కూలీకి రోజుకు రూ.257 వేతనం



ఉపాధి కూలీల హాజరును పరిశీలిస్తున్న పీడీ రామచంద్రారెడ్డి

వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీవిద్య, ఏపీఎం హరికృష్ణ , టీఏలు శ్వేత, హుస్సేన్‌బాష తదితరులు పాల్గొన్నారు.